# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 27-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రెండవ దశలో భాగంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఎస్ఐఆర్‌ను చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.
- ❖ సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను మరింత సులభతరం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు.
- ❖ నాణ్యత గల విత్తనాలను సన్నకారు రైతులకు అందచేస్తామని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.
- ❖ బంగాళాఖాతంలోని మొంథా తుఫాను రేపు ఉదయానికి తీవ్ర తుఫానుగా మారుతుందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = =

రెండవ దశలో భాగంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. న్యూఢిల్లీలో ఈ రోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేశ్ కుమార్ మాట్లాడుతూ... తొలిదశలో బీహార్‌లో ఎస్ఐఆర్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. రెండవ దశలో అండమాన్ నికోబార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ లలో ఎస్ఐఆర్‌ను చేపడతామన్నారు. ఈ ప్రక్రియలో 51 కోట్ల మంది ఓటర్లు భాగం కానున్నారని చెప్పారు. నవంబర్ 4 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాను డిసెంబర్ 9న ప్రకటిస్తామని, తుది జాబితాను ఫిబ్రవరి 7న విడుదల చేస్తామని గ్యానేశ్ కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా ఓటర్ల జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా కచ్చితత్వాన్ని నిర్ధారించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని గ్యానేశ్ కుమార్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను సులభతరం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు. మహారాష్ట్రలోని ముంబైలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద లబ్ధిదారులకు రెండు డీప్-సీ ఫిషింగ్ నౌకలను ఆయన అందచేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ... భారతదేశ మత్స్య పరిశ్రమను బలోపేతం చేయడానికి కేంద్రప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. కష్టపడి పని చేసే మత్స్యకారులకు లాభాలు చేరేలా కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ప్రపంచంలోని వివిధ దేశాలతో కలిసి భారత్ సముద్ర వాణిజ్యాన్ని అభివృద్ధి చేసే ఆలోచనలో ఉందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

పరిపాలనలోని ప్రతీ స్థాయిలో నైతిక ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జె. పి. నడ్డా పేర్కొన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఆయన ఈ రోజు ప్రసంగించారు. చేసే పనుల విషయంలో నిఘా ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విధులలో ప్రతి ఒక్కరూ అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉండాలని కేంద్రమంత్రి సూచించారు. ఈ సందర్భంగా జె పి నడ్డా సిబ్బంది చేత సమగ్రతా ప్రతిజ్ఞను చేయించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

నాణ్యత గల విత్తనాలను చిన్న, సన్నకారు రైతులకు అందచేస్తామని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జాతీయ విత్తన సంస్థ అత్యాధునిక విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ ప్లాంట్లు రైతులకు అధిక నాణ్యత గల విత్తనాలను సులభంగా అందుబాటులో ఉంచుతాయని అన్నారు. అదే విధంగా వ్యవసాయ ఉత్పాదకతను గణనీయంగా పెంచుతాయని చెప్పారు. నాణ్యత లేని విత్తనాలకు సంబంధించిన ఫిర్యాదులు మంత్రిత్వ శాఖకు అందుతున్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. అందువల్లనే నాణ్యమైన విత్తనాల లభ్యతను నిర్ధారించడం చాలా అవసరమన్నారు. ఇదిలా ఉండగా బరేలీ, ధార్వాడ్, హసన్, సూరత్‌గఢ్ రాయచూర్‌లలో ఉన్న ఐదు విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్‌లను కూడా ఆయన ప్రారంభించారు. వ్యవసాయ రంగంలో జాతీయ విత్తన సంస్థ పాత్ర కీలకమని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొంటూ...

(వాయిస్ 21 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ (ECMS) కింద 7 దరఖాస్తులకు మొదటి విడతగా ఈ రోజు ఆమోదం తెలిపింది. ఈ దరఖాస్తులన్నీ కలిపి మొత్తం 5 వేల 532 కోట్ల రూపాయల పెట్టుబడిగా పేర్కొంది. అలాగే 44 వేల 406 కోట్ల రూపాయల విలువైన ఉత్పత్తిగా వెల్లడించింది. న్యూఢిల్లీలో కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ తయారీకి సంబంధించిన 7 ప్లాంట్లకు ఆమోదం లభించిందన్నారు. ఈ ప్లాంట్లు దేశీయ అవసరాలను తీరుస్తాయన్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ లలో ఈ ప్లాంట్లు ఏర్పాటు అవుతాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఆగ్నేయ బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో బలపడిన మొంథా తుఫాను రేపు ఉదయానికి తీవ్ర తుఫానుగా మారుతుందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. గడిచిన 6 గంటల్లో గంటకు 17 కిలోమీటర్ల వేగంతో ఇది కదులుతోందని పేర్కొంది. ప్రస్తుతం చెన్నైకి 440 కిలోమీటర్లు, విశాఖపట్నంకి 530 కిలోమీటర్లు, కాకినాడకి 490 కిలో మీటర్ల దూరంలో కేంద్రీకృతం అయి ఉందని తెలిపింది. దీని ప్రభావంతో రేపు కోస్తా జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. మొంథా తుఫాను రేపు రాత్రికి తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్త స్వర్ణాలీ మజుందార్ తెలియచేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదం ప్రపంచ శాంతికి పెను ముప్పుగా పరిణమిస్తోందని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈ రోజు జరిగిన 20వ తూర్పు ఆసియా శిఖరాగ్ర సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ... ఉగ్రవాదం విషయంలో ఎప్పుడూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, సమిష్టిగా వ్యవహరించాలని కేంద్రమంత్రి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కేంద్ర వ్యవసాయ పరిశోధన మండలి (ICAR)ని కోరారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన వ్యవసాయ విశ్వవిద్యాలయలకు చెందిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెరుగైన వ్యవసాయ విద్య కోసం ఈ నియామకాలు అవసరమన్నారు. ఈ పోస్టులను సత్వరమే భర్తీ చేయాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు పంపుతామని, అదే విధంగా ఆయా రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో చర్చిస్తామని కేంద్రమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84,211 పాయింట్లతో స్వల్ప లాభాల్లో ప్రారంభమై.. చివరికి 567 పాయింట్ల లాభంతో 84,778 వద్ద ముగిసింది. నిఫ్టీ 170 పాయింట్ల లాభంతో 25,966 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 88 రూపాయల 25 పైసలుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.49 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4,044 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశ రక్షణ ఉత్పత్తిలో ప్రైవేట్ రంగం భాగస్వామ్యం పెరుగుతోందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. గత దశాబ్దంలో దేశీయ రక్షణ ఉత్పత్తి రికార్డు స్థాయిలో 1.5 లక్షల కోట్ల రూపాయలకు పైగా పెరిగిందని చెప్పారు. అలాగే రక్షణ ఎగుమతులు సైతం 23 వేల 500 కోట్ల రూపాయలకు చేరుకున్నాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =